ఏలియన్స్‌కు తమిళనాడులో ఆలయం

చెన్నై: తమిళనాడులోని సేలం, మల్ల మూపంబట్టిలో ఏలియన్స్‌కు ఓ గుడిని నిర్మించారు. శివపార్వతులు, మురుగన్, కాళి మాత విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. 11 అడుగుల లోతైన నేల మాళిగలో ఈ గుడిని నిర్మించారు. ఈ వార్త చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించడంతో రోజూ వందలాది మంది వచ్చి దర్శించుకుంటున్నారు. ఈ గుడిని నిర్మించిన లోగనాథన్ మాట్లాడుతూ, తాను గ్రహాంతర దేవతలతో మాట్లాడానని చెప్పారు. ఈ గుడిని నిర్మించేందుకు వారి నుంచి అనుమతి పొందానన్నారు. ప్రకృతి వైపరీత్యాలను గ్రహాంతర దేవతలు కాపాడగలవని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు.

వివాహంపై చైనాలో డిగ్రీ కోర్సు!

బీజింగ్: చైనాలోని సివిల్ అఫైర్స్ విశ్వ విద్యాలయం సరికొత్త డిగ్రీ కోర్సును ప్రకటించింది. వివాహాలకు సంబంధించిన పరిశ్రమలు, సంస్కృతి గురించి ఈ కోర్సులో బోధించనున్నట్లు వెల్లడించింది. ఈ రంగంలో నిపుణులను తయారు చేయనున్నట్లు తెలిపింది. మ్యారేజ్ సర్వీసెస్ అండ్ మేనేజ్‌మెంట్ పేరుతో ఈ కోర్సు సెప్టెంబరు నుంచి ప్రారంభమవుతుందని వివరించింది. కుటుంబ సలహాలు, అత్యంత విలాసవంతమైన వివాహ వేడుకల ప్రణాళిక, సంబంధాలను కుదర్చడం వంటివాటి గురించి బోధించనున్నట్లు తెలిపింది. దేశంలోని 12 ప్రావిన్సుల నుంచి 70 మంది అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఈ కోర్సులో ప్రవేశం కల్పించనున్నట్లు ప్రకటించింది.

నెమ్మదిగా నమిలి తింటే మధుమేహం దూరం!

న్యూఢిల్లీ: ఆహారం నెమ్మదిగా నమిలి తినడం వల్ల డయాబెటిస్ ముప్పు తగ్గుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. అన్నల్స్ ఆఫ్ పీడియాట్రిక్ ఎండోక్రినాలజీ అండ్ మెటాబొలిజం జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, ఆహారాన్ని వేగంగా తినేవారిలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ వృద్ధి చెందే అవకాశాలు పెరుగుతాయి. అంటే ఇది టైప్-2 మధుమేహానికి సూచిక అన్నమాట! శరీరంలోని కణాలు ఇన్సులిన్‌కు సరైన రీతిలో ప్రతిస్పందించనపుడు ఇన్సులిన్ రెసిస్టెన్స్ పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. అందువల్ల ఆహారాన్ని నెమ్మదిగా, బాగా నమలడం ద్వారా మనం బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చు, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచుకోవచ్చు.

5 వేల కిలోమీటర్ల దూరం నుంచి సర్జరీ!

బీజింగ్: సుమారు 5 వేల కిలోమీటర్ల దూరం నుంచి చైనాకు చెందిన ఓ వైద్యుడు ఓ రోగికి ఊపిరితిత్తుల కణితి తొలగింపు సర్జరీని విజయవంతంగా పూర్తిచేశారు. ఆపరేషన్ దాదాపు గంట సేపు సాగింది. టెలి మెడిసిన్, రోబోటిక్ సర్జరీలో ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు. షాంఘైలోని హౌషాన్ దవాఖానకు చెందిన ప్రముఖ సర్జన్ డాక్టర్ లీవీ, టెలి కమ్యూనికేషన్ టెక్నాలజీని ఉపయోగించి తన ఆఫీసు నుంచే రోబోటిక్ సర్జికల్ సిస్టమ్ ద్వారా ఈ ఆపరేషన్ నిర్వహించారు.

విస్తృతంగా లీక్ జరగలేదు

- అందుకే నీట్-యూజీ పరీక్షను రద్దు చేయలేదు
- సుప్రీంకోర్టు వెల్లడి
- లోపాలను సరిదిద్దుకోవాలని ఎన్టీఏకు సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 2: నీట్-యూజీ 2024కి సంబంధించి అక్రమాల ప్రభావం మొత్తం పరీక్షపై పడలేదని, అందుకే పరీక్షను రద్దు చేయలేదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. హజారీబాగ్, పట్నాను దాటి పరీక్ష పవిత్రత దెబ్బతినలేదని వ్యాఖ్యానించింది. నీట్-యూజీ పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లను జూలై 23న సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులు ఇవ్వడానికి కారణాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం తాజాగా వివరించింది. ఈ ఏడాదిలా ఒక నిర్ణయం తీసుకోవడం, దానిని మళ్లీ మార్చుకునే పద్ధతిని జాతీయ పరీక్ష సంస్థ(ఎన్టీఏ) ఆపేయాలని, ఇది విద్యార్థులకు మేలు చేయదని పేర్కొన్నది. ఎన్టీఏ పనితీరును మెరుగుపరిచేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఇస్రో మాజీ చీఫ్ కే రాధాకృష్ణన్ నేతృత్వంలో నియమించిన నిపుణుల కమిటీకి కోర్టు పలు సూచనలు చేసింది. పరీక్ష వ్యవస్థలో లోపాలను సరిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సెప్టెంబరు 30 నాటికి నివేదిక సమర్పించాలని పేర్కొన్నది. పరీక్షల వ్యవస్థను బలోపేతం చేయడానికి గానూ అధునాతన సాంకేతికతను వినియోగించడానికి సంబంధించి ప్రామాణికంగా ఉండేలా ఒక విధానాన్ని రూపొందించాలని సూచించింది.

నీట్ పీజీ పరీక్ష రాయాలంటే 1000 కి.మీ. వెళ్లాల్సిందే

- ఎగ్జామ్ సెంటర్ల కేటాయింపుపై వివాదం
- ఎన్‌బీఈ తీరుపై విద్యార్థుల ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే నీట్ పీజీ పరీక్షకు సంబంధించి మరో వివాదం తలెత్తింది. ఈ నెల 11న రెండు షిఫ్టులలో జరిగే ఈ పరీక్షకు కొందరు విద్యార్థులకు వెయ్యి కిలోమీటర్ల దూరంలో పరీక్షా కేంద్రాలను ఇవ్వడం పట్ల నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బీఈ) అధికారుల తీరు పట్ల పలువురు విద్యార్థులు సామాజిక మాధ్యమంలో తీవ్ర విమర్శలు చేస్తున్నారు. నీట్ పీజీ పరీక్షను విద్యార్థుల సొంత రాష్ట్రంలోనే నిర్వహించాలని, అదీ ఒకే షిఫ్ట్‌లో జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేరళలోని పతనంతిట్టకు చెందిన ఒక విద్యార్థికి విశాఖపట్నం సెంటర్‌గా ఇచ్చారు. ఇది తనకెంతో దూర, వ్యయ భారమని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. అంత దూరం వెళ్లాలంటే రిజర్వేషన్లు ఉండవని, పైగా వర్షాలు, రైళ్ల ఆలస్యం వంటి కారణాల వల్ల పరీక్ష రాయలేకపోతే ఎన్‌బీఈ బాధ్యత వహిస్తుందా? అని ప్రశ్నించారు. చాలా మంది ఇదే తరహా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలుగజేసుకుని తగు చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వారు విజ్ఞప్తి చేశారు.

బీఎస్ఎఫ్ చీఫ్ అగర్వాల్ తొలగింపు

- డిప్యూటీ ఖురానియా సైతం
- కేంద్రం అనూహ్య నిర్ణయం

న్యూఢిల్లీ: ఇటీవల సరిహద్దుల్లో ఉగ్రదాడులు పెరుగుతున్న క్రమంలో కేంద్రప్రభుత్వం శుక్రవారం అనూహ్య నిర్ణయం తీసుకుంది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్ నితిన్ అగర్వాల్, అతని డిప్యూటీ స్పెషల్ డీజీ (వెస్ట్) వైబీ ఖురానియాలను విధుల నుంచి తొలగించింది. వారిని సొంత రాష్ట్రాల కేడర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. వేర్వేరుగా జారీ చేసిన ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని ప్రకటించింది. అగర్వాల్ 1989 కేరళ కేడర్ అధికారి కాగా, ఖురానియా ఒడిశాకు చెందిన 1990 బ్యాచ్ అధికారి. వారి తొలగింపునకు కారణాలు తెలియరాలేదు. అయితే ఇటీవలి కాలంలో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారత్‌లోకి వస్తున్న చొరబాటుదారుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని, వీరిని అరికట్టడంతో బీఎస్ఎఫ్ విఫలమైందని ఆరోపణలు రావడంతో కేంద్రం ఈ చర్య తీసుకున్నట్టు తెలిసింది.

ఐఎస్ఎస్‌కు శుభాన్షు శుక్లా

- ఇండో-యూఎస్ స్పేస్ స్టేషన్ మిషన్‌కు ఎంపిక
- బ్యాకప్‌గా ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వెల్లడి

బెంగళూరు, ఆగస్టు 2: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లేందుకు గానూ చేపట్టనున్న ఇండో-యూఎస్ మిషన్‌కు గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను ఎంపిక చేసినట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శుక్రవారం ప్రకటించింది. బ్యాకప్‌గా గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌ను ఎంపిక చేసినట్టు తెలిపింది. ఏదైనా కారణంగా వల్ల శుభాన్షు శుక్లా ఈ మిషన్‌కు వెళ్లలేని పరిస్థితి ఉంటే ప్రశాంత్ బాలకృష్ణన్ వెళ్తారు. అంతరిక్ష కేంద్రానికి వెళ్లేందుకు గానూ అమెరికాకు చెందిన నాసా గుర్తింపు పొందిన యాక్సియమ్ స్పేస్ సంస్థతో ఇస్రోకు చెందిన హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా త్వరలో చేపట్టనున్న యాక్సియమ్-4 మిషన్‌లో భాగంగా వీరి అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. ఈ ఇద్దరు గగన యాత్రికులకు ఈ వారం నుంచి శిక్షణ ప్రారంభం కానున్నట్టు ఇస్రో తెలిపింది. అయితే, వీరి గగనయాత్రకు చివరగా మల్టీలాటరల్ క్రూ ఆపరేషన్స్ ప్యానల్(ఎంసీఓపీ) ఆమోదం లభించాల్సి ఉంటుందని పేర్కొన్నది.

భవిష్యత్తు ప్రయోగాలకు కీలకం

ఇప్పటివరకు భారత్ నుంచి వింగ్ కమాండర్(విశ్రాంత) రాకేశ్ శర్మ మాత్రమే అంతరిక్షంలో అడుగుపెట్టారు. 1984లో ఇండో-సోవియెట్ మిషన్‌లో భాగంగా ఆయన అంతరిక్షానికి వెళ్లారు. ఈ ఘనత సాధించబోతున్న రెండో వ్యక్తిగా శుభాన్షు లేదా ప్రశాంత్ బాలకృష్ణన్ నిలవబోతున్నారు. అంతరిక్షంలో అడుగుపెట్టనున్న ఐదో భారత సంతతికి చెందిన వ్యక్తిగా వీరిద్దరిలో ఒకరు నిలవనున్నారు. ఇంతకుముందు రాకేశ్ శర్మతో పాటు కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్, రాజాచారి అంతరిక్షానికి వెళ్లారు. కాగా, 2025లో భారత్ చేపట్టాలనుకుంటున్న ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రయోగానికి గానూ ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్న నలుగురు వ్యోమగాముల్లో(గగన్‌యాత్రి) వీరిద్దరు కూడా ఉన్నారు. ఈ నలుగురిలో శుభాన్షు శుక్లా పిన్న వయస్కుడు కాగా, ప్రశాంత్ బాలకృష్ణన్ పెద్దవయస్కుడు. ఈ మిషన్ ద్వారా వచ్చే అనుభవం భవిష్యత్తులో భారత్ చేపట్టబోయే అంతరిక్ష కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని, ఇస్రో, నాసా మధ్య సహకారం బలోపేతం అవుతుందని ఇస్రో తెలిపింది.

శుభాన్షు ప్రశాంత్

ఇద్దరూ భారత వాయుసేన పైలట్లే

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 1985 అక్టోబరు 10న జన్మించిన శుభాన్షు శుక్లా నేషనల్ డిఫెన్స్ అకాడమీ నుంచి 2006 జూన్ 17న భారత వాయుసేనలో చేరారు. సుఖోయ్-30ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, జాగ్వార్, హాక్, డోర్నియర్, ఏఎన్-32 వంటి వివిధ యుద్ధ విమానాలకు పైలట్‌గా ఆయనకు దాదాపు 2,000 గంటల విమానాలను నడిపిన అనుభవం ఉంది. కేరళలోని తిరువజియద్‌లో 1976 ఆగస్టు 26న జన్మించిన ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ ఎన్డీఏ ద్వారా 1998 డిసెంబరు 19న భారత వాయుసేనలో చేరారు. పైలట్‌గా అత్యున్నతమైన హోదా అయిన క్యాటగిరి-ఏ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉన్నారు. సుఖోయ్-30ఎంకేఐ స్క్వాడ్రన్‌కు నాయకత్వం వహించిన అనుభవం ఆయనకు ఉంది.

సీఏపీఎఫ్, అస్సాం రైఫిల్స్‌లో 84 వేల ఖాళీలు

న్యూఢిల్లీ: సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్), అస్సాం రైఫిల్స్ (ఏఆర్)లలో 84,106 ఉద్యోగ ఖాళీలు ఉన్నట్టు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ శుక్రవారం రాజ్యసభలో తెలిపారు. రెండు బలగాలలో మొత్తం 10,45,751 సిబ్బందికి గాను ఈ ఏడాది జూలై 1 నాటికి 84 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 ఫిబ్రవరి మధ్య 67,345 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని, మరో 64,091 ఖాళీల భర్తీకి చేపట్టిన ప్రక్రియ వివిధ దశలలో ఉందని చెప్పారు.

ఇంటెల్‌లో 15 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన

న్యూఢిల్లీ: చిప్ తయారీ కంపెనీ ఇంటెల్ ఖర్చులను తగ్గించుకోవడం కోసం ఉద్యోగులను తొలగిస్తున్నది. ఇంటెల్ సీఈఓ పాట్ గెల్సింగర్ తన ఉద్యోగులకు పంపిన సమాచారంలో ఈ బాధాకరమైన వార్తను తెలిపారు. 2025 నాటికి రూ.83,761 కోట్లు (సుమారుగా) ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. దీని కోసం ప్రస్తుతం పని చేస్తున్నవారిలో 15 శాతం (అంటే 15,000) మందిని తొలగించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ ఆఫర్‌ను ప్రకటిస్తామన్నారు.

21 నుంచి యూజీసీ నెట్ పరీక్షలు

న్యూఢిల్లీ: యూజీసీ నెట్ జూన్-2024 పరీక్షల సవరించిన షెడ్యూలును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేసింది. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 4 వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. పరీక్షా కేంద్రాలకు సంబంధించిన వివరాల కోసం పరీక్షలకు 10 రోజుల ముందు ఎన్టీఏ వెబ్‌సైట్లు https:// ugcnet.nta. ac. in లేదా www. nta.ac. inను సందర్శించవచ్చునని పేర్కొంది.

ఢిల్లీ విద్యార్థుల మృతికి 50 లక్షల పరిహారం

రావూస్ ఐఏఎస్

న్యూఢిల్లీ: తమ అకాడమీలో ఐఏఎస్‌కు కోచింగ్ తీసుకుంటూ జూలై 27న ఢిల్లీలోని పాత రాజేంద్ర నగర్‌లోని సెల్లార్ లైబ్రరీలో వరద నీట మునిగి మరణించిన ముగ్గురు విద్యార్థుల కుటుంబాలకు రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ నష్టపరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.50 లక్షల పరిహారం ఇవ్వనున్నట్టు తెలిపింది.

మఠంలోనే ఎక్కువ గౌరవం దొరికేది: యోగి

లక్నో: ఉత్తరప్రదేశ్ బీజేపీలో అసంతృప్తి సెగలు తీవ్రమవుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నైరాశ్య పూరిత వ్యాఖ్యలు చేశారు. ఆయన శాసనసభలో గురువారం మాట్లాడుతూ, 'ఇది ప్రతిష్ఠ కోసం పోరాటం కాదు, ఇంతకన్నా ఎక్కువ గౌరవం నా మఠంలో నాకు లభిస్తుంది' అన్నారు. బుల్డోజర్ విధానం వల్ల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దెబ్బతిందని మంత్రి సంజయ్ నిషాద్ చేసిన వ్యాఖ్యలపై ఆయన పరోక్షంగా స్పందించారు. బుల్డోజర్ విధానం అమాయకులను ఇబ్బంది పెట్టడానికి కాదని చెప్పారు. యువత, వ్యాపారులు, బాలికలు, మహిళల భద్రతతో ఆడుకునే క్రిమినల్స్, అరాచకాన్ని వ్యాపింపజేస్తూ, సామాన్యుల జీవితాలను దుఃఖమయం చేసేవారు పర్యవసానాలను అనుభవించేలా చేయడం కోసమే తాను పోరాడుతున్నానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బ తగలడంతో యోగిపై సొంత పార్టీ నేతలే విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే.

ఇంకా నయం.. వాన నీటికీ ఫైన్ వేయలేదు!

- ఢిల్లీ అధికారులపై హైకోర్టు ఆగ్రహం
- ఎస్‌యూవీ డ్రైవర్ అరెస్ట్‌పై అసంతృప్తి
- సివిల్స్ విద్యార్థుల మృతి కేసు సీబీఐకి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ సెల్లార్‌లో వరద నీటిలో మునిగి ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు మృతిచెందిన కేసును ఢిల్లీ హైకోర్టు సీబీఐకి అప్పగించింది. ఈ కేసులో నీటి ప్రవాహం ఉద్ధృతికి కారణమయ్యాడంటూ ఎస్‌యూవీ డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులను తప్పుబట్టిన న్యాయస్థానం.. 'ఇంకా నయం.. వాన నీటిలో కారు నడిపినందుకు ఎస్‌యూవీ డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్టుగానే బేస్‌మెంట్‌లోకి వచ్చినందుకు వాన నీటికి వారు చలాన్ విధించకుండా దయచూపారు' అని వ్యాఖ్యానించింది. విద్యార్థులు ఈ ప్రమాదం నుంచి ఎందుకు బయటపడలేకపోయారో అర్థం కావడం లేదని పేర్కొంది. రాజేంద్రనగర్ ప్రాంతంలో డ్రైనేజీలు సరిగ్గా పనిచేయడం లేదని ఎంసీడీ అధికారులు కమిషనర్‌కు ఎందుకు సమాచారం ఇవ్వలేదని న్యాయస్థానం ప్రశ్నించింది. నిర్దేశిత సమయంలో సీబీఐ విచారణ ముగిసేలా చూసేందుకు ఒక సీనియర్ అధికారిని నియమించాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)ని ఆదేశించింది. అన్ని అంశాల పరిశీలనకు న్యాయస్థానం ఒక కమిటీని నియమించింది. చీఫ్ సెక్రటరీ నేతృత్వంలోని ఈ కమిటీలో డీడీఏ ఉపాధ్యక్షుడు, ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఎంసీడీ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. ఎనిమిది వారాల్లో ఈ కమిటీ నివేదికను సమర్పిస్తుంది.

'90% కోచింగ్ సెంటర్లు పదేండ్లలో మూతపడతాయ్'

న్యూఢిల్లీ, ఆగస్టు 2: 90 శాతం కోచింగ్ సెంటర్లు రానున్న 10-15 ఏండ్లలో మూతపడతాయని సూపర్ 30 శిక్షణ సంస్థ వ్యవస్థాపకుడు ఆనంద్ కుమార్ అంచనా వేశారు. 'ఈ రోజుల్లో చాలా మంది కోచింగ్ సెంటర్లలో మార్కెటింగ్ టీమ్‌లను ఏర్పాటు చేసుకున్నారు. విద్యార్థులు వారికి క్లయింట్లయ్యారు' అని ఆయన అన్నారు. ఢిల్లీలోని రావూస్ కోచింగ్ సెంటర్ ఘటనపై మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నాణ్యమైన కంటెంట్‌తో ఆన్‌లైన్ తరగతులకు మంచి సిలబస్ ఇంకా తయారు కాలేదని.. అంకిత భావం గల టీచర్లు ఎవరైనా అలాంటి కంటెంట్ తయారు చేస్తే విద్యార్థులు ఇంట్లోనే కూర్చొని ఆ క్లాసులు వినడం ద్వారా ఆఫ్‌లైన్ క్లాసుల ద్వారా కంటే ఎక్కువ ప్రయోజనం పొందుతారని ఆయన అభిప్రాయపడ్డారు.

పూజా ఖేద్కర్ దుబాయ్‌కి పరార్ ?

న్యూఢిల్లీ:వివాదాస్పద మాజీ ఐఏఎస్ ట్రైనీ అధికారి పూజా ఖేద్కర్ దుబాయ్ వెళ్లిపోయినట్లు మీడియా కథనాలను బట్టి తెలుస్తున్నది. ఆమెకు ముందస్తు బెయిలు మంజూరు కాకపోవడంతో ఆమె దేశం విడిచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఆమె మోసపూరితంగా ఓబీసీ, డిజెబిలిటీ కోటా ప్రయోజనాలను పొందినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆమె ట్రైనీ ఐఏఎస్ అభ్యర్థిత్వాన్ని యూపీఎస్సీ రద్దు చేసింది. తనను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని, ముందస్తు బెయిలు మంజూరు చేయాలని ఆమె ఢిల్లీ కోర్టును కోరారు. కానీ కోర్టు గురువారం ఆమె పిటిషన్‌ను తిరస్కరించింది.

20 రోజుల్లో 14 మంది మృతి

- ఢిల్లీలోని షెల్టర్ హోమ్‌లో మిస్టరీ మరణాలు
- ఆప్ ప్రభుత్వంపై మహిళా కమిషన్ ధ్వజం
- మెజిస్టీరియల్ విచారణకు ఢిల్లీ మంత్రి ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 2: ఢిల్లీలోని ఆశా కిరణ్ షెల్టర్ హోమ్‌లో 'అనుమానాస్పద' మరణాలు కలకలం రేపుతున్నాయి. దివ్యాంగుల కోసం రోహిణిలో ఢిల్లీ ప్రభుత్వం నడుపుతున్న ఈ షెల్టర్ హోమ్‌లో గత 20 రోజుల్లో 14 మంది, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 27 మంది మృతి చెందినట్టు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ (ఎస్‌డీఎం) దర్యాప్తులో వెల్లడైంది. మృతుల్లో 14 నుంచి 15 ఏండ్ల వయసున్న ఓ మైనర్‌తోపాటు 20 ఏండ్లకుపైగా వయసున్న 13 మంది వయోజనులు ఉన్నట్టు ప్రాథమిక వార్తలు స్పష్టం చేస్తున్నాయి. వీరిలో 8 మంది మహిళలు, ఐదుగురు పురుషులు గత నెల 15-31 మధ్యనే మరణించినట్టు తెలుస్తున్నది. అందుకు కారణాలేమిటో ఇంకా తెలియరాలేదు. కానీ, నిరుటి కంటే ఈ ఏడాది ఆశా కిరణ్ షెల్టర్ హోమ్‌లో మరణాల సంఖ్య చాలా పెరిగిందని, పోస్టుమార్టం నివేదికలు వచ్చాకే ఆ మరణాలకు కారణమేంటో వెల్లడవుతుందని ఎస్‌డీఎం తెలిపారు. దీంతో ఆ షెల్టర్ హోమ్‌లోని వారికి సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) స్పందించింది. ఆశా కిరణ్ షెల్టర్ హోమ్‌లో అనుమానాస్పద మరణాలపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రేఖా శర్మ ధ్వజమెత్తారు. ఆ మరణాలకు ఢిల్లీ మంత్రి ఆతిశీ బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ.. ఆశా కిరణ్ షెల్టర్ హోమ్‌కు నిజనిర్ధారణ బృందాన్ని పంపినట్టు ప్రకటించారు. ఢిల్లీ ప్రభుత్వం నడుపుతున్న నైట్ షెల్టర్ హోమ్‌లపై కూడా ఎన్‌సీడబ్ల్యూ ఆడిట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాగా, ఆశా కిరణ్ షెల్టర్ హోమ్‌లో జరిగినట్టుగా చెప్తున్న మరణాల సంఖ్యతో ఆతిశీ విభేదించారు. ఈ ఏడాది జనవరి నుంచి 14 మరణాలు సంభవించినట్టు చెప్పారు. ఈ మరణాలపై మెజిస్టీరియల్ దర్యాప్తు చేపట్టి 48 గంటల్లోగా నివేదిక సమర్పించాలని ఢిల్లీ రెవెన్యూ శాఖ అదనపు చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. మున్ముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆమె కోరారు.

నది దిశ మార్చుకోవడంతోనే!

వయనాడ్‌లో ఎక్కువ నష్టానికి కారణమిదే కావొచ్చు

వయనాడ్: వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనకు సంబంధించి నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్సెస్ స్టడీస్ విశ్రాంత శాస్త్రవేత్త సోమన్ కీలక విషయాలు వెల్లడించారు. ఈ విపత్తులో ఎక్కువగా నష్టం జరిగిన ముండక్కై, చూరల్‌మల ప్రాంతాలు నది ఒడ్డున ఉన్నాయని చెప్పారు. గతంలో ఇక్కడ కొండచరియలు విరిగి నదిలో పడి ఉండవచ్చని, అలా నదీ ప్రవాహం దిశ మారగా ఏర్పడిన ప్రాంతంపైనే ఇప్పుడు ఇండ్లు, దుకాణాలు వెలిశాయని ఆయన అభిప్రాయపడ్డారు. నీటికి గత ప్రవాహం గుర్తు ఉంటుందని, ఇప్పుడు నది గతంలో ప్రవహించిన దిశను మళ్లీ తీసుకోవడంతోనే ఇవన్నీ కొట్టుకుపోయి ఉండొచ్చని అన్నారు. కొండచరియలు విరిగిపడటం ప్రారంభమైన వెల్లరిమల సముద్రమట్టానికి 2వేల అడుగుల ఎత్తులో ఉందని, ముండక్కై, చూరల్‌మల మాత్రం 900 - 1000 అడుగుల ఎత్తులో ఉన్నాయని, కాబట్టి రాళ్లు చాలా బలంగా కిందకు దూసుకొచ్చాయన్నారు.

334కు పెరిగిన మృతుల సంఖ్య

వయనాడ్ విపత్తులో ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 334కు పెరిగింది. ఇంకా 281 మంది ఆచూకీ దొరకలేదు. శిథిలాల కింద ఉన్నవారిని గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. డ్రోన్‌లు, థర్మల్ స్కానర్‌ల ద్వారా గాలిస్తున్నారు. ముండక్కైలో కొట్టుకుపోయిన ఓ దుకాణం దగ్గర శిథిలాల కింద జీవం ఉండొచ్చని థర్మల్ స్కానర్ అప్రమత్తం చేసింది. అయితే, 3 మీటర్ల లోతులో, ఐదు గంటల పాటు వెతికినా మనిషి ఆనవాళ్లు దొరకలేదు. మరోవైపు, పశ్చిమ కనుమలలోని 56,800 చదరపు కిలోమీటర్ల ప్రాంతం పర్యావరణపరంగా సున్నితమైనదని పేర్కొంటూ కేంద్రం ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. వయనాడ్‌లో కొండచరియల విధ్వంసానికి గురైన 13 గ్రామాలు కూడా దీని పరిధిలో ఉన్నాయి.

దాణాకూ కొరత!

- పశువుల కడుపు నింపడమూ కష్టమే
- ఇప్పటికే గోధుమలు, పప్పులకు లోటు
- బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు
- భారీగా పెరుగుతున్న ధరలు

న్యూఢిల్లీ, ఆగస్టు 2: దేశంలో మనుషులు తినే ఆహారమే కాదు.. పాడి పశువుల కడుపు నింపే ఆహారమూ కరువవుతున్నది. గోధుమలు, బియ్యం, పప్పు దినుసులు, చక్కెర కొరత తర్వాత ఇప్పుడు దేశంలో దాణా కొరత తీవ్రమవుతున్నది. ఈ విషయాన్ని పార్లమెంటు సాక్షిగా కేంద్రమంత్రి వెల్లడించారు. ప్రతి యేటా ఇవే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏదైనా కొరత ఏర్పడినప్పుడు ఎగుమతులను నిషేధించడం మినహా ఉత్పత్తిని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి.

దాణా కొరత.. ధరలు రెట్టింపు

దేశంలో దాణా కొరత తీవ్రమవుతున్న విషయాన్ని కేంద్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ బుధవారం పార్లమెంటులో వెల్లడించారు. పచ్చి దాణాకు 11.24 - 32 %, ఎండు దాణాకు 23% కొరత ఉందని ఝాన్సీలోని ఐసీఏఆర్ - ఇండియన్ గ్రాస్‌లాండ్ అండ్ ఫాడర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐజీఎఫ్ఆర్ఐ) అంచనా వేసిందని ఆయన తెలిపారు. కొరత కారణంగా దాణా ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో పాడి రైతులకు పశుపోషణ భారంగా మారుతున్నది. దాణా ధరలు పెరగడం వల్ల పాల ధరలు కూడా పెరిగిపోతున్నాయి. ఇది ప్రజలందరిపైనా భారం మోపుతున్నది.

బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు

బియ్యం, చక్కెర విషయంలోనూ కొరత వేధిస్తున్నది. దీంతో ప్రభుత్వం కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించింది. దేశంలో చెరుకు ఉత్పత్తి కూడా క్రమంగా తగ్గి కొరత ఏర్పడుతున్నది. అక్టోబరుతో ముగియనున్న 2024-25 సీజన్‌కు సంబంధించి చెరుకు దిగుబడి గత ఏడాది కంటే తగ్గవచ్చని ఇండియన్ షుగర్ మిల్స్ అండ్ బయో ఎనర్జీ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ అంచనా వేసింది. ఇక, కొన్ని రకాల బియ్యానికి కూడా దేశంలో కొరత ఉంది. ఫలితంగా గత ఏడాది కాలంగా బియ్యం ధరలు భారీగా పెరిగిపోయాయి.

పప్పులకు విదేశాలపై ఆధారపడాల్సిందే

పప్పుదినుసులకు కూడా దేశంలో కొరత ఏర్పడుతున్నది. దీంతో దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం క్రమంగా పెరుగుతున్నది. 2022-23లో 24.96 లక్షల టన్నుల పప్పు దినుసులను దిగుమతి చేసుకోగా, 2023-24లో ఇది దాదాపు 90 శాతం పెరిగి 47.38 లక్షల టన్నులను దిగుమతి చేసుకున్నట్టు ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది.

గతేడాది కంటే తగ్గనున్న గోధుమల ఉత్పత్తి

దేశంలో రెండేండ్లుగా గోధుమల కొరత పెరగడంతో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కొరతను నివారించడానికి ప్రభుత్వం 2022లో గోధుమల ఎగుమతులను నిషేధించింది. 2023లోనూ గోధుమల ఉత్పత్తి ప్రభుత్వ అంచనాల కంటే 10 శాతం తగ్గింది. ఇక, 2024లో 112 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమల ఉత్పత్తి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేయగా, రోలర్ ఫ్లోర్ మిల్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాత్రం 105 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి మాత్రమే ఉంటుందని పేర్కొన్నది.

యాప్స్ టోకరా

- దేశంలో టాప్ యాప్స్‌లో 'డార్క్ ప్యాటర్న్స్'
- నాలుగు రకాలుగా వినియోగదారులకు టోపీ
- విశ్లేషించిన 53 యాప్స్‌లో 52 ఇలాంటివే
- జాబితాలో నెట్‌ఫ్లిక్స్, ఓలా, స్విగ్గీ మొదలైనవి



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): వినియోగదారులను మోసపుచ్చి ఆర్థిక ప్రయోజనం పొందుతున్న యాప్స్ దేశంలో పెరిగిపోతున్నట్టు అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) తాజా నివేదికలో వెల్లడించింది. తాము విశ్లేషించిన 53 యాప్స్‌లో 52 యాప్స్ ఇలాంటి 'డార్క్ ప్యాటర్న్స్'ను అనుసరిస్తున్నట్టు తెలిపింది. ఈ జాబితాలో నెట్‌ఫ్లిక్స్, ఓలా, స్విగ్గీ వంటి యాప్స్ ఉన్నట్టు పేర్కొంది.

నాలుగు విధాలుగా 'డార్క్ ప్యాటర్న్స్' మోసం

1. **గోప్యతకు భంగం:** 79 శాతం యాప్స్‌లో యూజర్ల ప్రైవసీకి సంబంధించిన భద్రతలో లోపాలు ఉన్నట్టు గుర్తించామని నివేదిక వెల్లడించింది.
2. **ఇంటర్ఫేస్‌లో జోక్యం:** ఏదైనా ఐటెమ్ ఆర్డర్ ఇవ్వాలనుకొంటున్నప్పుడు మనం సెలక్ట్ చేయకపోయినా.. కొన్ని ఐటెమ్స్‌ను లేదా సేవలను డీఫాల్ట్‌గా యాడ్ చేస్తూ అంతిమ ధరను పెంచడం. ఇలాంటి మోసాలు 45% యాప్స్‌లో గుర్తించినట్టు నివేదిక తెలిపింది.
3. **డ్రిప్ ప్రైసింగ్:** ప్రారంభంలో ధర తక్కువగా చూయిస్తూ, పేమెంట్ ఆప్షన్‌కు వచ్చే సరికి హిడెన్ ఛార్జీలు, అదనపు రుసుములను కలిపేయడం. ఇలాంటి మోసాలు 43 శాతం యాప్స్‌లో ఉన్నట్టు నివేదిక వివరించింది.
4. **ఫాల్స్ అర్జెన్సీ:** యూజర్లకు నిర్ణయం తీసుకొనే సమయం ఇవ్వకుండా ఆఫర్ అయిపోతుందని డెడ్‌లైన్ టైమ్ పెడుతూ మోసపుచ్చడం. ఇలాంటి మోసాలు 32 శాతం యాప్స్‌లో జరుగుతున్నట్టు గుర్తించారు.